

ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామనాయుడు

## ప్రయాణికులకు భద్రత కల్పించడమే లక్ష్యం

న్యాల్‌కల్, జూన్ 9: ఆటోలో ప్రయాణించే వారికి పూర్తి భద్రత, భరోసా కల్పించడమే పోలీసుల లక్ష్యమని హద్నూర్ ఎస్సై రామనాయుడు అన్నారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం మండల పరిధిలోని హద్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై ఆటోలకు మై ఆటో ఈజ్ సేఫ్ స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రయాణికులు ఆటోలో ఎక్కగానే డ్రైవర్ వెనుకాల అంటించిన స్టిక్కర్‌ను క్యూఆర్ కోడ్ ఫొటో తీసుకుని పెట్టుకోవాలని సూచించారు. ఏదైనా అనుకోని ఘటన జరిగితే వెంటనే పోలీస్ స్టేషన్ లేదా షీటీంలకు పంపించాలన్నారు. వెంటనే పోలీసులు చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో హద్నూర్ పోలీసులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి




భెల్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు




మాట్లాడుతున్న భెల్ ఈడీ కేబీరాజా

రామచంద్రాపురం, జూన్ 9 : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని భెల్ ఈడీ కేబీ రాజా అన్నారు. భెల్ కమ్యూనిటీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు వేడుకలకు కేబీరాజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో విజేతలకు ఆయన మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భెల్ కమ్యూనిటీ సెంటర్ ఆవరణంలో చిన్నారుల కోసం సమ్మర్ క్యాంప్‌ని ఏర్పాటు చేశామన్నారు. 640మంది చిన్నారులు సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో భెల్ జీఎం చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నక్కవాగులో చెత్త డంపింగ్

- నిప్పుపెట్టి తగులబెడుతున్న సిబ్బంది
- చిట్కుల్ ఉత్తమ పంచాయతీలో గాడి తప్పిన చెత్త నిర్వహణ
- అధికారుల పాలనలో జల వనరుల సమాధి



చిట్కుల్ సమీపంలోని నక్కవాగులో డంపు చేసిన చెత్త

పటాన్‌చెరు, జూన్ 9 : మండల పరిధిలోని చిట్కుల్ పంచాయతీలో సేకరిస్తున్న తడి.. పొడి చెత్తను నక్కవాగులో డంపు చేస్తున్నారు. దీంతో క్రమక్రమంగా ఆ వాగును పూడ్చివేస్తున్నారు. గతేడాది జిల్లాలో ఉత్తమ పంచాయతీగా చిట్కుల్ ఎంపికైంది. ప్రస్తుతం పంచాయతీ అధికారుల ప్రత్యేక పాలనలో మురుగు కూపంగా మారుతున్నది. చిట్కుల్‌లో గత పాలకవర్గం చేసిన కృషికి ఉత్తమ పంచాయతీగా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందింది. అన్ని విభాగాల్లో అద్భుతమైన ప్రగతిని చూపడంతో జిల్లా ఉత్తమ పంచాయతీగా అవార్డు సైతం సాధించింది. రాష్ట్రస్థాయి ఉత్తమ పంచాయతీగా పోటీ పడింది. పంచాయతీ పాలక వర్గం పాలన మార్చిలో ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది. కార్యదర్శి, ప్రత్యేక అధికారుల నేతృత్వంలో పంచాయతీ పాలన కొనసాగుతున్నది. అధికారుల పాలనలో పైకి అన్ని బాగున్నట్టు ఉన్నా.. పరిశీలించి చూస్తే తడి.. పొడి చెత్త నిర్వహణలో లోపాలు కనిపిస్తున్నాయి. ఈ పంచాయతీ పరిధిలో నూతనంగా అనేక కాలనీలు వెలుస్తున్నాయి. గ్రామంతో పాటు వడ్డెరకాలనీలు ఉన్నాయి. ఈ కాలనీలు, గ్రామం నుంచి సేకరించిన తడి.. పొడి చెత్తను నేరుగా గ్రామ శివారులో ఉన్న నక్కవాగులో డంప్ చేస్తున్నారు. ఎక్కువ చెత్త పోగు కాగానే వాటికి నిప్పు పెడుతున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా పొగలతో నిండిపోతున్నది. నక్కవాగులో ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు, గృహాలనుంచి వెలువడే చెత్తను టన్నుల కొద్ది వేస్తున్నారు. వీటిని తగులబెట్టడంతో ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం పొంచి ఉంది.

### అలంకార ప్రాయంగా డంప్‌యార్డ్

చిట్కుల్‌లో డంప్ యార్డును బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. ఉత్తమ పంచాయతీగా చిట్కుల్‌కు గుర్తింపు రావడానికి డంప్‌యార్డు నిర్వహణ కూడా ఒక కారణం. గ్రామంలో సేకరించిన తడి.. పొడి చెత్తను రీసైకిల్ చేసి ప్లాస్టిక్ వ్యర్థాలను అమ్మడం, కూరగాయలు, మట్టిలో కలిసే వ్యర్థాలను సేంద్రియ ఎరువులుగా మార్చే వారు. వానపాములు వదిలిన సేంద్రియాలను నర్సరీలో వాడి మొక్కలను పెంచే వారు. గ్రామంలోని చెత్తను పూర్తిస్థాయిలో పునర్వినియోగం చేస్తుండడంతో చిట్కుల్ పంచాయతీకి రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చింది. అప్పటి కలెక్టర్లు, డీపీవోలు, ఇతర శాఖల అధికారులు జిల్లాకు ఇతర రాష్ట్రాల నుంచి ప్రత్యేక బృందాలు వస్తే చిట్కుల్ గ్రామ పంచాయతీనే చూయించేవారు. గత కొన్ని నెలల్లోనే చిట్కుల్‌లో పారిశుధ్యం పడకేసింది. డంప్ యార్డు అలంకారప్రాయంగా మారింది. ఎటు చూసినా మురుగు కాల్వలు దర్శనం ఇస్తున్నాయి. గ్రామంలో సేకరించిన చెత్తను తగుల బెట్టి పర్యావరణానికి హాని చేస్తున్నారు. నక్కవాగు నామరూపాలు లేకుండా చెత్తతో నింపుతున్నారు. నక్కవాగు నీరు నేరుగా మంజీర నదిలో కలుస్తాయి. సాగు, తాగునీటి అవసరాలు తీర్చే మంజీర నదిలోకి టన్నుల కొద్ది చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను పారవేయడంపై పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిట్కుల్‌తో పాటు బచ్చుగూడెం గ్రామం వరకు చెత్త నుంచి వెలువడుతున్న పొగలు వ్యాపిస్తున్నాయి. పొగలతో అనారోగ్యాలు వస్తాయని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. చిట్కుల్‌లో పారిశుధ్యం, చెత్త డంపింగ్‌పై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సేకరించిన చెత్తను పునర్వినియోగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### నక్కవాగులో చెత్తను డంప్ చేయొద్దు



నక్కవాగును చెత్తతో పూడ్చివేయడం సరికాదు. వాగులను కాపాడాల్సిన అధికారులే నక్కవాగును చెత్తతో పూడ్చివేయడం ఎంతవరకు సమంజసం. సేకరించిన చెత్తను డంప్ యార్డులో రిసైకిల్ చేసి ఉపయోగకరంగా మార్చాలి. చెత్తను కాల్వలు, వాగుల్లో పారవేస్తుండటంతో గ్రామం మురుగు కూపంగా మారుతున్నది. ఒకప్పుడు పరిశుభ్రంగా ఉన్న గ్రామం ఇప్పుడు కంపు కొడుతున్నది. వాయుకాలుష్యం పెరుగుతున్నది. ప్రజల ఆరోగ్యాలకు సమస్యగా మారింది. బచ్చుగూడెం, చిట్కుల్ గ్రామాల ప్రజలకు ఈ పొగలతో ప్రమాదం పొంచి ఉంది. అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలి.

- బి.కృష్ణ, చిట్కుల్



నిరుపయోగంగా ఉన్న చిట్కుల్‌లోని డంపింగ్‌యార్డ్



జహీరాబాద్‌లో గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

## గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు

కోహీర్, జూన్ 9 : గంజాయి మొక్కలను సాగు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వీరారెడ్డి, ఎస్సై అనిల్‌కుమార్ హెచ్చరించారు. ఎక్సైజ్ శాఖాధికారులు జహీరాబాద్ పట్టణ శివారులో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. తిరుమల వెంచర్ ఆవరణలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. వాటి విలువ రూ.1.20లక్షల వరకు ఉంటుందని వారు వెల్లడించారు. గంజాయి పంటను సాగు చేసిన రైతు రాఘవరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ శాఖ పోలీసులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

సంగారెడ్డి, జూన్ 9 : సమాజంలో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక సేవలో పాల్గొని ప్రజలకు సేవ చేయాలని పద్మిని దామోదర రాజ నర్సింహ సూచించారు. ఆదివారం పట్టణంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో కల్కి అమ్మ భగవాన్ కల్యాణ వేడుకల్లో పాల్గొని ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమం పరం జ్యోతి అమ్మ భగవాన్ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మిని మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ దైవ చింతన సేవ కార్యక్రమాల్లో భాగస్వామ్యం ఉండాలన్నారు. కార్యక్రమంలో నిర్మల, కూన సంతోశ్‌కుమార్, అనిల్ కొండల్‌రెడ్డి, నాగరాజు, అమ్మ భగవాన్ సేవా సమితి సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సంగమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

ఝరాసంగం, జూన్ 9: మండల కేంద్రంలో దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం బీజేపీ నాయకులు భారత ప్రధానిగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేస్తున్న నరేంద్ర మోదీ పేరు మీద ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన మహా మంగళ హారతి నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గొల్ల భాస్కర్, విజేందర్ రెడ్డి, అరుణ్ కుమార్, అసెంబ్లీ కన్వీనర్ నౌబాద్ జగన్నాథ్, ఓంకార్ యాదవ్, ఎంజీ దుర్గయ్య, వివిధ మండలాల అధ్యక్షులు బంటు విశ్వనాథం, వైద్యనాథ్, శ్రీకాంత్, పూల సంతోస్, అల్లాడి బక్కయ్య, మల్లేశ్, సురేశ్ పూరి పాల్గొన్నారు.


## ఖర్గేను కలిసిన ఎంపీ సురేశ్ శెట్కార్



ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ

నారాయణఖేడ్, జూన్ 9: జహీరాబాద్ ఎంపీ సురేశ్ శెట్కార్ ఆదివారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను మార్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా మల్లికార్జున ఖర్గేను కలిసిన ఎంపీని ఖర్గే అభినందించారు. ఈ సందర్భంగా ఖర్గేను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎంపీతో పాటు కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఉన్నారు.

## ఓవైసీని కలిసిన మోహిద్



ఓవైసీని సన్మానించి పుష్పగుచ్ఛం ఇస్తున్న మోహిద్ పటేల్

నారాయణఖేడ్, జూన్ 9 : ఎంఐఎం పార్టీ నారాయణఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు మోహిద్ పటేల్ ఆదివారం హైదరాబాద్‌లో ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఓవైసీ ఐదోసారి ఎంపీగా ఎన్నికైన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఓవైసీని శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఓవైసీని కలిసిన వారిలో నియోజకవర్గ నాయకులు మహ్మద్ మజర్, అబ్దుల్ జబ్బార్, షేక్ అమ్జద్ ఉన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలకు అనుమతి తప్పనిసరి

న్యాల్‌కల్, జూన్ 9 : ప్రైవేట్ పాఠశాలలకు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి ఉండాలని ఎంఈవో మారుతీరాథోడ్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతి లేకుండా ప్రైవేట్ పాఠశాలలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండల పరిధిలోని హద్నూర్‌లో ఓ ప్రైవేట్ పాఠశాలపై ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయమై డీఈవో దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




తెల్లాపూర్‌లో స్వచ్ఛసర్వేక్షన్‌లో పాల్గొన్న కమిషనర్ సంగారెడ్డి, టీనా అధ్యక్షుడు రమణ

## పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

రామచంద్రాపురం, జూన్ 9: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, టీనా అధ్యక్షుడు ఈశ్వరిగారి రమణ అన్నారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపల్, నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెల్లాపూర్‌లోని మేళ్ల చెరువు పరిసరాల్లో స్వచ్ఛసర్వేక్షణ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చెరువు పరిసరాల్లో ఉన్న చెత్తను తొలగించి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ సంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛసర్వేక్షణ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసరాలను శుభ్రం చేయిస్తున్నట్లు చెప్పారు. అనంతరం టీనా అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం గేటెడ్ కమ్యూనిటీ వాసులు స్వచ్ఛసర్వేక్షన్‌లో పాల్గొనడం చాలా సంతోషకరమని తెలిపారు. చెరువులను పరిరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మంజుల, టీనా సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు

జిన్నారం, జూన్ 9: మండల పరిధిలోని గడ్డపోతారం గ్రామానికి చెందిన రెండు కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నీలం మధు పరామర్శించారు. గ్రామానికి చెందిన బాలుగారి శ్రీనివాస్ పెద్దకూతురు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మధు బ్లాక్ కాంగ్రెస్ పార్టీ జిన్నారం మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డితో కలిసి వచ్చి శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించారు. అలా గే ఎన్ ఎంఆర్ యువసేన సభ్యుడు నారబోయిన నర్సింగ్‌రావు ఇటీవల బైక్ మీద నుంచి పడి గాయపడి ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆయన ఇంటికి వెళ్లి నర్సింగ్‌రావును పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అశోక్, మాణిక్యరావు, నారబోయిన శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, పంబాల గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మలుపు... ప్రమాదానికి పిలుపు



అన్నాసాగర్ వద్ద రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలు, చెట్లకొమ్మలు

అందోల్, జూన్ 9 : జోగిపేట-సంగారెడ్డి ప్రధాన రహదారిపై అన్నాసాగర్ చెరువు కట్ట మూల మలుపు ప్రమాదకరంగా ఉంది. అక్కడ చెట్ల కొమ్మలు, ముళ్ల పొదలు ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. వాహనదారులు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గతంలో జరిగిన ప్రమాదాల్లో పలువురు మృతి చెందగా, మరికొందరు గాయపడిన ఘటనలు ఉన్నాయి. ఈ రోడ్డుపై నిత్యం నారాయణఖేడ్ నుంచి సంగారెడ్డి, హైదరాబాద్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులు, వివిధ పనుల నిమిత్తం జోగిపేటకు వచ్చే ప్రజలు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డుపై ముళ్ల పొదలు, చెట్లకొమ్మలు ఏపుగా పెరిగి రోడ్డుకు అడ్డంగా ఉండడంతో తరుచూప్రమాదాలు జరుగతున్నాయి. జోగిపేటకు వెళ్లేందుకు ఇదీ ఒక్కటే రోడ్డు కావడంతో ప్రమాదమని తెలిసినా ప్రయాణం తప్పడంలేదని వాహనదారులు వాపోతున్నారు. సంబందిత శాఖ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలు, చెట్ల కొమ్మలు తొలిగించి ప్రయాణాలు సాఫీగా సాగేలా చూడాలంటున్నారు.



అవార్డు అందుకుంటున్న ప్రవీణ్‌కుమార్

## ప్రవీణ్‌కుమార్‌కు బంగారు కామధేనువు పురస్కారం

మునిపల్లి, జూన్ 9 : మండల పరిధిలోని మల్లారెడ్డిపేట ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్‌కు జాతీయ బంగారు కామధేనువు పురస్కారం లభించినట్లు ఎంఈవో దశరథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి, తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ బంగారు అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించినట్లు తెలిపారు. ప్రవీణ్‌కుమార్ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు ఏపుగా పెరిగేందుకు కృషి చేసినందుకు ఈ అవార్డు లభించినట్లు తెలిపారు.

## తాటిపల్లిలో సీసీ డ్రైనేజీ పనులు ప్రారంభం



సీసీ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్, ఎంపీటీసీ స్వప్నభాస్కర్

మునిపల్లి, జూన్ 9 : మండల పరిధిలోని తాటిపల్లి గ్రామంలోని బీసీ కాలనీలో ఆదివారం సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించినట్లు మాజీ సర్పంచ్ అంజిరెడ్డి తెలిపారు. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చొరవతోనే మండల పరిధిలోని గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో తాటిపల్లి ఎంపీటీసీ స్వప్నభాస్కర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేశ్, మారుతి, మైపాల్, పాండు పాల్గొన్నారు.

## అపూర్వ సమ్మేళనం

పుల్కల్, జూన్ 9 : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 1998-99 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 25 ఏండ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. చిన్నప్పుడు చేసిన అల్లరి, గురువుల బెత్తం దెబ్బలు తదితర పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఎవరెవరు ఏమి చేస్తున్నారో తెలుసుకున్నారు. అనంతరం అప్పుడు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, గురువులు పాల్గొన్నారు.

## బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



బొంతపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

గుమ్మడిదల, జూన్ 9: బడీడు పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. ఆదివారం మండల పరిధిలోని బొంతపల్లిలో ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్తులతో కలిసి గ్రామంలో బడిబాటలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు ప్రసాద్ మాట్లాడుతూ.. బొంతపల్లిలో ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా విద్యార్థులకు మెరుగైన విద్యను బోధిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించిన విశ్వకర్మ సంఘం ఉద్యోగులు

సంగారెడ్డి, జూన్ 9 : పాఠశాలలు, కళాశాలలు, పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని సౌత్ జోన్ డీసీపీ రవివర్మ తెలిపారు. ఆదివారం పట్టణంలోని పాత జడ్పీ సమావేశ మందిరంలో విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ జిల్లా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పలు ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు శిరీషారాఘవేంద్ర, రావుల గిరిధర్, బండి అపర్ణ, కాసుల విద్యాసాగర్, మారోజు సుదర్శన్, మారోజు నిర్మల, జిల్లా అధ్యక్షుడు నర్సింహమూర్తి, ప్రధాన కార్యదర్శి శివలింగ వరప్రసాద్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణే ధ్యేయం కావాలి



యాజమాన్యంతో కలిసి కరపత్రిక, సీడ్ బాళ్లను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ గౌడ్

అమీన్ పూర్, జూన్ 9 : పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం ప్రతి ఒక్కరి ప్రాథమిక లక్ష్యంగా నిర్దేశించుకుని ముందుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం త్రో అండ్ గ్రో ఉద్దేశంతో ఏర్పడిన వ్యాపార సంస్థ ఉత్పత్తుల కరపత్రికతో పాటు సీడ్ బాళ్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణ సంరక్షణకు ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని కోరారు. అనంతరం నిర్వాహకులు శ్రీనివాస్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో త్రో అండ్ గ్రో యజమాని నరసింహారాజు, నిర్మల్ ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకటనారాయణ, కాంగ్రెస్ పార్టీ వీవర్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, కౌన్సిలర్ శశిధర్ రెడ్డి, స్థానికులు చైతన్య పాల్గొన్నారు.

## నియామక పత్రాలు అందజేత



నియామక పత్రాలు అందజేస్తున్న కాటా శ్రీనివాస్ గౌడ్

అమీన్‌పూర్, జూన్ 9: టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్‌గా పొన్నం అశోక్‌గౌడ్, పటాన్‌చెరు నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్‌గా శివకృష్ణను నియమించారు. ఈ సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ తన నివాసంలో వారికి నియామక పత్రాలు అందజేశారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిన్నారం మండల నాయకులు వడ్డే కృష్ణ, శ్రీకాంత్ రెడ్డి, రాజు గౌడ్, ఆంజనేయులు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారిని లాలించిన మహిళా పోలీస్



సంగారెడ్డిలో పాపను లాలిస్తున్న మహిళా కానిస్టేబుల్

సంగారెడ్డి, జూన్ 9 : గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలు రాసేందుకు కేంద్రానికి చంటి పిల్లతో హాజరైన అభ్యర్థి నుంచి చిన్నారిని తీసుకుని మహిళా పోలీసు కానిస్టేబుల్ లాలించారు. ఆదివారం పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న కరుణ పాఠశాలలో పరీక్ష రాసేందుకు అభ్యర్థి తన పాపతో వచ్చింది. ఈ విషయం గమనించి అక్కడే విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ తల్లిలా లాలించింది. పాప తల్లి పరీక్ష కేంద్రంలోనికి వెళ్లగానే చిన్నారి రోదనలు మొదలుపెట్టింది. పాప రోదనను విని మహిళా పోలీసు దగ్గరకు తీసుకుని లాలించడంతో పాప ఏడ్పును ఆపివేసింది.